# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 38 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 12 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :38 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 12 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

- ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఎం ఆదేశం
- దసరా సామాన్యుల పండుగలా జరగాలి, వీఐపీలదిగా కాదని స్పష్టం
- అక్టోబర్ 13 నుంచి జాతీయ స్థాయి సరస్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు
- విజయవాడ ఉత్సవ్ 2.0తో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని సూచన
- రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సీఎం సమీక్ష



పెన్ పవర్ డెస్క్:విజయవాడలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, త్వరలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ 2.0లను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించా లని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ భారీ కార్యక్రమాల విజయానికి దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.దసరా ఉత్సవాలు సామాన్యుల పండుగలా జరగాలని, వీఐపీల కోసం కాదని సీఎం స్పష్టం చేశారు. "ఇంద్రకీలాద్రి ఉత్సవాలు సామాన్యుల దసరాగా ఉండాలి, వీఐపీల దసరాగా కాదు. దీనికి అన్ని వర్గాలు సహకరించాలి" అని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో, వారి రాక వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. వీఐపీల రాకతో విధించే ట్రాఫిక్ ఆంక్షల గురించి ప్రజలకు ముందుగా తెలియజేయాలని, వారి ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు.అక్టోబర్ 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న 'జాతీయ సరస్ మేళా–2026' దేశానికే ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ మేళాకు, దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్న నేపథ్యంలో ఆమె పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన కోసం 576 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో 208 స్టాళ్లు ఏపీకి చెందినవని అధికారులు వివరించారు. మన రాష్ట్ర మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మేళా గొప్ప వేదిక కావాలని సీఎం అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0'ను కూడా ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, ప్రజల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ వరుస కార్యక్రమాల వల్ల భక్తులు, పర్యాటకుల రాకతో ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సీఎం పేర్కొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఏపీ పంచాయతీరాజ్ దేశంలోనే నెంబర్ 1..

### పవన్ కళ్యాణ్ పాలనపై చిరంజీవి ప్రశంసలు

- కపిలేశ్వరపురం వచ్చిన చిరంజీవి.. కూటమి ప్రభుత్వ పాలనపై వ్యాఖ్యలు
- తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన చిరంజీవి
- ఏపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించిన మెగాస్టార్
- రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య
- పవన్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు దేశంలో మొదటి ర్యాంక్ వచ్చిందని వెల్లడి
- ప్రజలకు ఇలాగే మంచి జరగాలని ఆకాంక్ష

పెన్ పవర్ డెస్క్:మెగాస్టార్ చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని ఆయన కితాబిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా, కపిలేశ్వరపురం పర్యటన సందర్భంగా ఆయన

- మిగతా 2లో



## సీఎంకు ఉరవకొండ అభివృద్ధి నివేదిక..

### ఎమ్మెల్యేలకు చంద్రబాబు కీలక సూచన

- ఉరవకొండ అభివృద్ధి నివేదికను సీఎం చంద్రబాబుకు అందించిన మంత్రి పయ్యావుల
- నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో పుస్తకం రూపకల్పన
- అభివృద్ధి పనులపై ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- గత ప్రభుత్వ విధ్వంసం, తమ ప్రభుత్వ వికాసం మధ్య తేడా చెప్పాలన్న చంద్రబాబు

- మిగతా 2లో

## జగన్ అందుకే తప్పుడు కథనాలు, కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు



- ఆర్థిక నేరాల కేసుల నుంచి తప్పించుకునేందుకే జగన్ కాలయాపన చేస్తున్నారన్న మంత్రి
- ఈడీ విచారణకు రాజకీయ రంగు పులుముతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ
- వివేకా హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని తీవ్ర విమర్శలు
- అవినీతి సొమ్ముతో పెట్టిన సాక్షి పత్రికతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- కేసుల విచారణ వేగవంతం చేసి నిజాలు బయటపెట్టాలని మంత్రి రవీంద్ర డిమాండ్

- మిగతా 2లో

## వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం

- రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పవన్ స్పష్టం
- వైసీపీ మద్దతుదారులు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు కేటాయించామని వెల్లడి
- రూ.2,052 కోట్లతో 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి
- గత వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని పార్టీ రంగుల కోసం దుర్వినియోగం చేసిందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:"వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం. మేం అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూస్తున్నాం. ఏ పార్టీ బతకాలనేది కాదు, వ్యవస్థలు బతకాలి, గ్రామాలు బాగుపడాలి, ప్రజల జీవితాలు మెరుగుపడాలి. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత, వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకున్నాను"

- మిగతా 2లో



## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..

### ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

- ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం

- మిగతా 2లో

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు..

### ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌పై చంద్రబాబు ధీమా

- బీసీ రిజర్వేషన్లను తగ్గించి వైసీపీ అన్యాయం చేసిందని విమర్శ
- విజయవాడ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా కొనసాగుతోందని వెల్లడి
- స్థానిక ఎన్నికల విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేస్తామని ధీమా

- మిగతా 2లో





## యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు

### పాకిస్థాన్‌కు ఇరాన్ వార్నింగ్

- సౌదీ-టర్కీ-పాకిస్థాన్ రక్షణ ఒప్పందంపై ఇరాన్ తీవ్ర అభ్యంతరం
- యెమెన్‌లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక
- పాకిస్థాన్ మధ్యవర్తి పాత్ర కోల్పోయిందన్న ఇరాన్ చట్టసభ సభ్యులు
- సౌదీకి కాగితపు ఒప్పందాలు భద్రత ఇవ్వలేవని ఎద్దేవా
- ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచిన కొత్త సైనిక కూటమి

- మిగతా 2లో

## ప్రభుత్వం భయపడుతోంది..

### అందుకే సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది: సీజేపీ

- సీఈసీకి వ్యతిరేక నిరసనను ప్రభుత్వం తమపైకి మళ్లించుకుంటోందని సీజేపీ ఆరోపణ
- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశామన్న అశుతోష్ రంకా
- మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శ
- సీజేపీ వ్యవస్థాపకుడి కుటుంబ విషాదంలో ఢిల్లీ పోలీసుల తీరు అమానుషమని వ్యాఖ్య
- తమ పోరాటానికి మద్దతిచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు

పెన్ పవర్ డెస్క్:ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోం దని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా

- మిగతా 2లో






## ఆఫ్రికా తీరంలో పెను విషాదం..

### పడవ ప్రమాదంలో 109 మంది మృతి

- ఆఫ్రికా తీరంలో వలసదారులతో వెళుతున్న పడవ బోల్తా
- ప్రమాదంలో 15 మంది చిన్నారులతో సహా 109 మంది మరణం
- మరో 116 మంది ఆచూకీ గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- జిబౌటి నుంచి యెమెన్‌కు వెళుతుండగా జరిగిన ఘోర దుర్ఘటన
- 80 మందిని అధికారులు కాపాడగా, సహాయక చర్యలు చేపట్టిన ఐఓఎం

పెన్ పవర్ డెస్క్:ఆఫ్రికా తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. మెరుగైన భవిష్యత్తు కోసం వలస వెళుతున్న వారి జీవితాలు సముద్రంలో కలిసిపోయాయి. సుమారు 350 మందితో ప్రయాణిస్తున్న ఒక పడవ బోల్తా పడిన ఘటనలో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు కూడా ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) ఆదివారం ప్రకటించింది.వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 8–9 మధ్య రాత్రి సమయంలో జిబౌటి నుంచి యెమెన్‌కు వలసదారులతో ఈ పడవ బయలుదేరింది. జిబౌటిలోని ఒబాక్ పోర్ట్ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహెరే సమీపంలోకి రాగానే పడవ

- మిగతా 2లో

## చింత చెట్టు కింద కూర్చుని గిరిజనులతో పవన్ కళ్యాణ్ మమేకం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం గిరిజన గూడెంలో పర్యటించి, అడవి బిడ్డలతో మమేకమయ్యారు. మారుమూల గ్రామానికి స్వయంగా వెళ్లి, చింతచెట్టు

- మిగతా 2లో



## చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా..

### తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్



- చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి-వడపళని మార్గం ప్రారంభం
- జెండా ఊపి రైలును ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం విజయ్
- కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు
- సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో 15 కిలోమీటర్ల మేర ఈ మార్గం నిర్మాణం
- పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా..

### తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది. ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

## ఆఫ్రికా తీరంలో పెను విషాదం..

### పడవ ప్రమాదంలో 109 మంది మృతి

అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 109 మృతదేహాలను వెలికితీశారు. వీరిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు (తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడగా, వారందరూ ఇథియోపియా జాతీయులని ఐఓఎం తెలిపింది. వీరిలో 64 మందికి ఒబాక్‌లోని తమ మైగ్రెంట్ రెస్పాన్స్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించి, అవసరమైన సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది. జిబౌటియన్ అధికారులు గల్లంతైన వారి కోసం గాలింపు మరియు సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. పడవ మునిగిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై జిబౌటిలోని ఐఓఎం చీఫ్ ఆఫ్ మిషన్ అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఇది హృదయ విదారకమైన ప్రాణ నష్టం. గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో వేలాది మంది వలస జీవులు ప్రయాణించే ఈ మార్గంలో ఉన్న ప్రమాదాలకు ఈ ఘటన అద్దం పడుతోంది" అని ఆయన అన్నారు. ఐఓఎం మిస్సింగ్ మైగ్రెంట్స్ ప్రాజెక్ట్ ప్రకారం, 2025లోనే ఈ మార్గంలో 900 మందికి పైగా వలసదారులు మరణించడం లేదా గల్లంతవడం గమనార్హం.

## జగన్ అందుకే తప్పుడు కథనాలు, కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు

వాస్తవాలను పక్కదారి పట్టించి, వాటిని రాజకీయంగా వాడుకోవడమే జగన్ రాజకీయ నీతి అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తనపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ఎదుటివారిపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. తన పత్రికలో తప్పుడు కథనాలు, కార్టూన్లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గుడ్డ కాల్చి ఎదుటివారి మీద వేయడం జగన్‌కు అలవాటుగా మారిందని, దర్యాప్తు సంస్థల విచారణకు రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ సుమారు రూ.48 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై 2011లో కాంగ్రెస్ హయాంలోనే సీబీఐ కేసులు నమోదు చేసిందని మంత్రి గుర్తుచేశారు. "షెల్ కంపెనీలను సృష్టించి, కంపెనీల వాటాల విలువను కృత్రిమంగా పెంచి, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఇప్పుడు జగన్ నానా తంటాలు పడుతున్నారు" అని రవీంద్ర వివరించారు.

**వివేకా హత్య నుంచి ఈడీ విచారణ వరకు.. అన్నీ నాటకాలే**

తన బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. "అప్పట్లో చంద్రబాబుపై నిందలు వేస్తూ 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో కథనాలు రాయించారు. కానీ, ఆయన చెల్లెలు సునీత న్యాయపోరాటంతో నిజాలు వెలుగులోకి వచ్చి, విచారణ తాడేపల్లి ప్యాలెస్ వైపు దారితీయలేదా?" అని జగన్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం ఈడీ విచారణ వేగవంతం అవుతుండటంతో, దానిని అడ్డుకునేందుకు జగన్ 4,000కు పైగా డిశ్చార్జ్ పిటిషన్లు వేసి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

**అసత్యాల 'సాక్షి'.. దర్యాప్తు సంస్థలపై దుష్ప్రచారం**

అవినీతి సొమ్ముతో ఏర్పాటైన సాక్షి పత్రిక, పేరుకు మాత్రమే సాక్షి అని, అది అసత్యాలకు నిలువుటద్దంగా మారిందని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఈడీ అనేది కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని, రాష్ట్ర ప్రభుత్వానికి దానితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "విచారణ వేగవంతం అవుతుంటే, దానిపై రాజకీయ కక్ష సాధింపు అని ముద్ర వేస్తూ సాక్షిలో కార్టూన్లు, కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది దర్యాప్తు సంస్థల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడమే" అని అన్నారు.

## చింత చెట్టు కింద కూర్చుని గిరిజనులతో పవన్ కళ్యాణ్ మమేకం

కింద రచ్చబండపై కూర్చుని వారి సమస్యలను ఓపికగా విన్నారు. అక్కడికక్కడే పరిష్కారాలు చూపుతూ, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆదేశాలు జారీ చేసి గిరిపుత్రుల్లో భరోసా నింపారు. పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలోని రాకోట గిరిశిఖర గ్రామంలో 'అడవి తల్లి బాట 2.0' కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాకవాడ, రాకోట, సువర్లవాడ, వేములకొండ గ్రామాలను కలిపే 3.4 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 2.29 కోట్లతో శంకుస్థాపన చేశారు. అనంతరం రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఏర్పాటు చేసిన 'మాటా-మంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. రాకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ విద్య, వైద్య, మౌలిక వసతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ప్రజల వినతులపై తక్షణమే స్పందించిన పవన్ కళ్యాణ్, శిథిలావస్థలో ఉన్న రాకోట పాఠశాల పునరుద్ధరణకు రూ. 20 లక్షలు, గ్రామ ఆరోగ్య కేంద్రానికి రూ. 15 లక్షలు, హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. వీటితో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి వివిధ పథకాల కింద సుమారు రూ. 5 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు గిరిజన మహిళలు పూలు చల్లుతూ, హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన స్థానిక ఎంపీపీ పాఠశాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం వెదురు ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను కలిసి, ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రైతులకు వ్యవసాయ పనిముట్లను కూడా పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి నేరుగా తమ గ్రామానికి వచ్చి సమస్యలు తీర్చడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

# వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం

అని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని కాకవాడ గ్రామంలో "అడవితల్లి బాట 2.0" కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. తాము బాధ్యతలు స్వీకరించాక వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు విడుదల చేశామని, తమకు ప్రజల శ్రేయస్సే ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రూ.2,052 కోట్ల అంచనా వ్యయంతో 2,569 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా 1,341 గిరిజన ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనలు నిర్మించనున్నట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజావసరాలు తీర్చాల్సిన వందల కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేయడానికి, వాటిని తొలగించడానికి దుర్వినియోగం చేసిందని తీవ్రంగా విమర్శించారు. అదే నిధులతో ఎన్నో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించి ఉండవచ్చన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలోనూ రోడ్లపైకి వచ్చి పోరాడిన జనసైనికులు, వీరమహిళల త్యాగాలను మరువలేమని అన్నారు. వారి త్యాగాలకు గుర్తింపుగా, పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన కార్యకర్తలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కూటమి నాయకులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ఉండాలని ఆకాంక్షించారు.

గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అని, కొండలను తొలచి, రాక్ కటింగ్ వంటి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. తాము నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను స్థానిక ప్రజలే పర్యవేక్షించాలని కోరారు. ఏమైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉద్యానవనాల అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, మొబైల్ కనెక్టివిటీ వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. అటవీ అనుమతులు వేగవంతం చేసి సెల్ టవర్లు, రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కోరిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. అధికార అహంకారంతో ప్రజలను భయపెట్టే రోజులు పోయాయని, తప్పును ప్రశ్నించే ధైర్యంతో పాటు బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు..

### ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌పై చంద్రబాబు ధీమా

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) తెలుగుదేశం పార్టీ తరఫున 40 శాతం వరకు సీట్లు కేటాయించనున్నట్లు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఈ ఎన్నికల ఫలితాల ఆధారంగానే పార్టీ నాయకుల పనితీరును అంచనా వేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో దాదాపు సగం ఉన్న బీసీల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి తీవ్ర అన్యాయం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. రిజర్వేషన్లు అందకుండా అడ్డుకోవడానికి, ఎన్నికలను వాయిదా వేయడానికి వైసీపీ కోర్టు మెట్లెక్కిందని విమర్శించారు. వైసీపీ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో గెలుపు అవకాశాలు, నిజాయతీ, సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మరోవైపు, విజయవాడలో జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలు, అభివృద్ధి పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవ రాత్రి వేడుకలను విజయవంతం చేయాలని, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ, పర్యాటక శాఖలను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. "అడవి తల్లి బాట" తొలి దశలో 1,976 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం పూర్తి కావడం పట్ల జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా సాగుతోందని చంద్రబాబు అన్నారు. విజయవాడ జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంత వాసులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, సంక్రాంతికి నెల్లూరులో మరో 4,000 మందికి పట్టాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, స్థానిక ఎన్నికల్లో గెలిచి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌ను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. "ఆరోగ్యవంతమైన, సంపన్న, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్" నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## సీఎంకు ఉరవకొండ అభివృద్ధి నివేదిక..

ఆర్థిక మంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని సీఎంకు అందజేశారు. నియోజకవర్గ ప్రోగ్రెస్ కార్డు తరహాలో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు మంత్రి పయ్యావుల తెలిపారు. ఉరవకొండకు తాగునీటి సరఫరా, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు, కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, నూతన భవనాల మంజూరు వంటి పనుల వివరాలను ఇందులో పొందుపరిచినట్లు సీఎంకు వివరించారు.

ఈ నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రి పయ్యావులను అభినందించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేయడంతో పాటు, వాటి వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న వికాసానికి మధ్య తేడాను ప్రజలకు స్పష్టంగా వివరించాలని తెలిపారు. ఇందుకోసం ఎమ్మెల్యేలందరూ ఇలాంటి నివేదికలు, ప్రోగ్రెస్ కార్డులను ప్రజల ముందు ఉంచాలని అభిప్రాయపడ్డారు. తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు, లిఫ్ట్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి మంత్రి పయ్యావుల కేశవ్ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వం భయపడుతోంది..

జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, "గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. "ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. "తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళన కలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు" అని రంకా తెలిపారు. తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు. ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. "నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. "ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

## యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు

సౌదీ అరేబియా, టర్కీలతో కలిసి పాకిస్థాన్ ఏర్పాటు చేసిన రక్షణ ఒప్పందం కార్యాచరణలోకి రావడంపై ఇరాన్ తీవ్ర స్వరంతో స్పందించింది. యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే ప్రాంతంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరించింది. ముఖ్యంగా, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ఈ కూటమిలో చేరడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం, సౌదీ మౌలిక సదుపాయాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు పెరగడంతో, ఈ త్రైపాక్షిక ఒప్పందం అక్టోబర్ 5 నుంచి కార్యాచరణ దశలోకి ప్రవేశించింది. సౌదీ అరేబియాకు మద్దతుగా టర్కీ, పాకిస్థాన్ చర్యలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో, వేలాది మంది పాకిస్థాన్ సైనికులను సౌదీకి పంపవచ్చనే వార్తలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పందించారు. "మేము కూడా ఈ వార్తను విన్నాం. అది నిజం కాదని ఆశిస్తున్నాం. యెమెన్ విషయంలో ఏ దేశం జోక్యం చేసుకున్నా ప్రాంతంలో అవాంఛనీయ పరిణామాలు తప్పవు" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, టర్కీ కంటే పాకిస్థాన్‌పైనే ఇరాన్ తన విమర్శలను ఎక్కువగా కేంద్రీకరించింది. టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య మధ్యవర్తిగా ఇస్లామాబాద్ పోషిస్తున్న ప్రముఖ పాత్రే ఇందుకు కారణం. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు అహ్మద్ నదేరి మాట్లాడుతూ, "యెమెన్ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో సౌదీ పక్షాన పాకిస్థాన్ చేరడం.. ఆ దేశం ఇకపై మధ్యవర్తిగా కాకుండా, ప్రాంతీయ జోక్యదారుగా మారిందని చూపిస్తోంది" అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇరాన్‌లోని పలువురు చట్టసభ సభ్యులు ఈ ఒప్పందాన్ని ఓ కాగితపు ఒప్పందంగా కొట్టిపారేశారు. పార్లమెంట్ జాతీయ భద్రత కమిటీ సభ్యుడు ఇబ్రహీం రెజాయీ సౌదీని ఉద్దేశిస్తూ ఘాటుగా విమర్శించారు. "ఏళ్ల తరబడి అమెరికాను ఏకపక్షంగా వాడుకున్నా రాని భద్రత, ఇప్పుడు టర్కీ, పాకిస్థాన్‌లతో చేసుకున్న కాగితపు ఒప్పందం వల్ల వస్తుందా? అనేది సౌదీలు తెలుసుకోవాలి. భద్రత కోసం ఇతరులను వేడుకోవాల్సిన దుస్థితి రాకుండా మీ విధానాలను సరిదిద్దుకోండి" అని ఆయన హితవు పలికారు.

ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ఈ కూటమిని తీవ్రంగా విమర్శిస్తోంది. "యెమెన్ ప్రజలకు వ్యతిరేకంగా సౌదీ యుద్ధంలో టర్కీ, పాకిస్థాన్ చేరాయి" అని తస్నిమ్ న్యూస్ పేర్కొనగా, "ఇది మక్కా కూటమా లేక యెమెన్‌లోని అణగారిన ప్రజలకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమా?" అని నూర్ న్యూస్ ప్రశ్నించింది. ఈ పరిణామం పశ్చిమాసియాలో ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది.

# ఏపీ పంచాయతీరాజ్ దేశంలోనే నెంబర్ 1..

- మొదటి పేజి తరువాయి

స్థానికులతో ముచ్చటించారు. ఈ క్రమంలో ఏపీలో పాలన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చాలా కాలం తర్వాత రాష్ట్రానికి వచ్చానని, ఇక్కడ పాలన ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నానని చిరంజీవి చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో మంచి మార్పులు వచ్చాయని ప్రజలు తనకు చెప్పినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తన సోదరుడు పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ పనితీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో దేశవ్యాప్తంగా 23వ ర్యాంకులో ఉన్న పంచాయతీరాజ్ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకోవడం గర్వకారణమని అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పరోక్షంగా సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇలాగే మంచి జరగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్లు చిరంజీవి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్ఎల్ హాస్పిటల్, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్మించిన వైద్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చిరంజీవి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి ముదిరిన తర్వాతే చాలామంది మేల్కొంటున్నారని, లక్షణాలను ముందుగా గుర్తిస్తే సులభంగా కోలుకోవచ్చని సూచించారు. తన భార్య, సోదరి, తల్లికి క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయిస్తానని తెలిపారు. ముఖ్యంగా మహిళలు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. నటుడు మురళీమోహన్ ఆరోగ్యాన్ని చూశాక, తాను కూడా మరింత జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించానని చిరంజీవి పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని వివరిస్తూ, తాను హైదరాబాద్ నుంచి గాజు వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటానని చెప్పారు. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల గుండెపోటు ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి హాజరవడంతో మెగా అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన్ను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఛైర్మన్ గన్ని భాస్కర్ రావు, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జీవీబీ చౌదరి, పలువురు మంత్రులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపాలిటీ రిజర్వేషన్లపై ఆశావహుల ఉత్కంఠ...

## గిద్దలూరు మున్సిపల్ సింహాసనం జనరల్ కా..? బిసికా..?

## జనరల్, బీసీల్లో పలువురు ఆశావహులు



ఓసి సామాజిక వర్గం నుంచి కాపు అభ్యర్థి బలిజ సేవా సంఘం అధ్యక్షులు కమతం శ్రీనివాసులు.





బీసీ సామాజిక వర్గం నుంచి నంది శ్రీనివాసులు.



కాపు సామాజిక వర్గం ఓసి నుంచి పసుపులేటి శ్రీనివాసులు



ఓ.సి రెడ్డి సామజిక వర్గం పల్లె శ్రీనివాస్ రెడ్డి

**గిద్దలూరు పెన్‌పవర్ అక్టోబర్ 11**

గిద్దలూరులో అధికార పార్టీ, టిడిపిలో, ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ సీపీలోనూ రిజర్వేషన్ల పై ఉత్కంఠ మొదలైంది. అధికార పార్టీ లో మున్సిపల్ సింహాసనాన్ని అధిరోహించేందుకు పలువురు అన్ని కేటగిరీల్లో ఆశావహులు ఆశిస్తున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది. జనరల్ కేటగిరిలో నైనా బి సి లోనైనా పలువురు ఈ కుర్చీని ఆశిస్తున్నారు. గిద్దలూరు మున్సిపాలిటీ నగర పంచాయతీగా ఉండగా రెండు పర్యాయాలు బిసీకి కేటాయించారు. ఈ ఏడాది వరకు సుమారు దశాబ్ద కాలం ఆ సీటులో బీసీ ఏలుబడినే సాగింది. అయితే ప్రభుత్వం ఈరోజు ప్రకటించిన జి.ఓ మేరకు రొటేటెడ్ పద్ధతి లో చేయవచ్చునేది తెలియటంతో ఈమారు జనరల్ కేటగిరికి వస్తుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. జనరల్ కేటగిరీకీ అయితే రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి దప్పిలి కాశిరెడ్డి ఈ సీటును ఆశిస్తున్నారు . కాశిరెడ్డి తండ్రి , తాతలు గిద్దలూరు గ్రామ పంచాయతీ నుంచి సర్పంచులుగా కొనసాగిన నేపథ్యం ఉండడంతో ఆయన సీటు దక్కించుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయన తండ్రి దప్పిలి రంగస్వామి రెడ్డి నాటి రాజకీయ దురంధరుడు ఆనాటి ఆర్థిక మంత్రి, స్పీకర్ పిడతల రంగారెడ్డి సమీప బంధువులుగా, అనుచరులుగా గిద్దలూరులో చక్రం తిప్పిన వారే. గిద్దలూరు పట్టణంలో వారి కుటుంబ రాజకీయం దాదాపు 122 ఏండ్ల చరిత్ర కలిగి ఉంది.అదే జనరల్ కేటగిరీలో స్థానిక శ్రీకృష్ణ దేవరాయ బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు,ఎమ్మెల్యే అశోక్ రెడ్డితో వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా మొదట్నుంచి సన్నిహితంగా ఉన్న కమతం శ్రీనుతో పాటు , పల్లె శ్రీనివాసరెడ్డి, పసుపులేటి శ్రీనివాసులు ఇంకా పలువురు ఆశిస్తున్నారు. ఇక బీసీ కేటగిరీ నుంచి కూడా పలువురి పేర్లు వినవస్తున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే ముత్తుములకు సన్నిహితునిగా పేరున్న నంది శ్రీను పేరు బలంగా వినబడుతుంది. బీసీల్లో మరో సామాజిక వర్గం నుంచి దూదేకుల హజరత్ ఆశిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయింపు జరిగితే మాజీ కౌన్సిలర్ లొక్కు రమేష్ పేరు వినబడుతుంది. ఏదేమైనా రిజర్వేషన్లు ప్రకటించే వరకు ఆశావహుల్లో ,పార్టీలో పరిస్థితి గుంభనంగా ఉంది. మున్సిపాలిటీ పీఠం కోసం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆశీస్సుల కోసం ఆశావహులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. వైసీపీలో ఎన్నికల వేడి పెద్దగా కనిపించకపోయినా పోటీలో ఉంటామని ప్రకటిస్తున్నారు. కానీ గిద్దలూరు వైఎస్సార్ సీపీలో గ్రూపుల గొడవ ఉంది. గిద్దలూరు జనరల్ కేటగిరికి వస్తే వైసిపి నుంచి ప్రముఖ వైద్యులు డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆపార్టీ అధిష్ఠానం మాత్రం నాయకులందరూ ఎన్. ఓ.సి లతో సిద్ధంగాఉండమని సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది . ఇప్పటికే అధికార తెలుగుదేశం గ్రౌండ్ వర్క్ పూర్తి చేసిందనే చెప్పాలి. శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి వివిధ అభివృద్ధి కార్యక్రమాల తో ప్రజలతో మమేకమై వారికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిస్కారంలో నిమగ్నమై ప్రచార కార్యక్రమం పూర్తి చేశారు . నిత్యం ప్రజల కు అందుబాటులో ఉంటున్నారు ఇందులో ఎమ్మెల్యే కు అన్ని పనుల్లో, కార్యకలాపాల్లో చేదోడుగా ఉండే ఆయన సోదరులు కృష్ణ కిశోర్ రెడ్డి కూడా ఎన్నికలకు సంబంధించిన గ్రౌండ్ వర్క్ పూర్తి చేయడంలో నిమగ్నమై ఉన్నారు. ఎమ్మెల్యేతో పాటు కృష్ణ కిశోర్ రెడ్డి కూడా ప్రజలతో ప్రత్యేకించి పార్టీ కేడర్ కు అందుబాటు లోఉంటూ ఎప్పటికప్పుడు వివిధ అంశాల పై సమీక్షలు జరుపుతూ ఎన్నికల కోసం నిరంతర కృషి చేస్తున్నారు. ఏదైనా మున్సిపల్ పీఠాన్ని తొలిసారి అధికారికంగా ప్రత్యక్ష ఎన్నిక ద్వారా కైవసం చేసుకొని గిద్దలూరు పురపాలనలో తెలుగుదేశం మార్క్ పాలన చూపడానికి టిడిపి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది.

పెన్ పవర్ మార్కాపురం - ప్రకాశం

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మనదే

-చైర్మన్ సహా 40 వార్డులు గెలిచేలా పనిచేయండి -కూటమి శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే

-స్థానిక ఎన్నికలపై మూడు పార్టీలతో ఇంటూరి సమావేశం

-బీసీ లకు 34 శాతం సీట్లు కేటాయిస్తామని వెల్లడి





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 11**

కందుకూరు మున్సిపాలిటీకి త్వరలో జరగబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు తిరుగులేని మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలకు కూటమి పార్టీల నేతలను సమాయత్తం చేయడంలో భాగంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీకి 15 సంవత్సరాలుగా ఎన్నికలు జరగకుండా వైసిపి అడ్డంకులు సృష్టించింది. న్యాయ పోరాటంతో, వాటిని అధిగమించి ఎన్నికలకు వెళుతున్నాం. హైకోర్టు తీర్పు ఇచ్చిన రోజే వైసిపి ఓటమి ఖాయమైంది. ప్రజలు ఇవ్వబోయే ఫలితాలే వారికి చెంపపెట్టు కావాలి. చైర్మన్, 40 కౌన్సిలర్ స్థానాలను మనమే గెలుచుకోబోతున్నాం అని అన్నారు. 45 సంవత్సరాల క్రితం మున్సిపాలిటీ ఏర్పడినా, పెరిగిన జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరగలేదు. వైసిపి పాలనలో అస్సలు పట్టించుకోలేదు అని అన్నారు. చంద్రబాబు కందుకూరు వచ్చినప్పుడు 50 కోట్లు ఇచ్చారు. ఈమధ్య హెచ్‌ఏఎం పథకం ద్వారా 30 కోట్లు వచ్చాయి. రోడ్ల వెడల్పు, కొత్తగా కాలువలు, రోడ్ల నిర్మాణం, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు చేసి చూపించాం. 9 కోట్లతో కుంటలు, పార్కులు అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. 1800 ఎకరాల గర్భ కంద్రిక భూములు, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, ఎం ఐ జి లేఅవుట్ భూములు దశాబ్దాలుగా 22 ఏ లో ఉంటే ఆ సమస్యను పరిష్కరించాం అని అన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని వైసిపి ప్రభుత్వం బలవంతంగా నెల్లూరు జిల్లాలో కలిపితే పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చినట్లుగానే, తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపాం అని అన్నారు. ఇవన్నీ మేము చేసిన మంచి పనులు. ప్రజలకు అన్యాయం చేయాలని చూసిన ఆ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదు. స్థానిక ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పేలా పట్టణ ప్రజలు తీర్పు ఇవ్వాలి అని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం సీట్లు తప్పకుండా కేటాయిస్తాం. అన్ని వర్గాల వారికి సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుంది అని అన్నారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలు ఐక్యమత్యంతో ఎన్నికల్లో పోటీ చేస్తాయి. ఎవరికి అవకాశం వచ్చినా, మిగిలిన వారందరూ సహకరించాల్సిందే. పొత్తు ధర్మం పాటించాల్సిందే అని అన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరగాలి. ప్రభుత్వ పథకాలను వివరించాలి. చైర్మన్ సహా 40 వార్డులలో మనదే విజయం కావాలి. కూటమి ప్రభుత్వ బలాన్ని చాటి చెప్పాలి అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ జనసేన అధ్యక్షుడు కళ్యాణ్, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, పట్టణ మాజీ అధ్యక్షులు కంద్రా మాల్యాద్రి పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీ ఈడబ్ల్యూ డి ఎస్ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, అప్పనబోయిన నరసింహారావు, రాష్ట్ర కమిటీ నాయకులు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, పార్లమెంటు నాయకులు షేక్ రూబీ, నియోజకవర్గ నాయకులు ముచ్చు శ్రీను, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, షేక్ మున్నా, పార్టీ నేతలు షేక్ సలాం, పులి నాగరాజు, కాకుమాని ప్రవీణ్, మురారిశెట్టి శ్రీకాంత్, వడ్డేళ్ల రవిచంద్ర, కొచ్చర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే..గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోంది

- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 11**

ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంత్రి పంపిణీ చేశారు. 89 మంది లబ్ధిదారులకు రూ. 30.60 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక కొండపి నియోజకవర్గం లో ఇప్పటివరకు 2,560 మందికి రూ. రూ.20.37 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్యం కోసం పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని సీఎం చంద్రబాబు పెద్ద మొత్తంలో సీఎంఆర్ నిధులు విడుదల చేస్తున్నారన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని, పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందిన్నారు. పి 4 తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే..గొడ్డలి పార్టీ ఓర్వలేక రాష్ట్రంలో అసత్యాలు, అబద్ధాలు చేస్తోందని మండి పడ్డారు. వైసీపీ ఓ విషవృక్షం, ప్రజలు దాన్ని స్థానిక ఎన్నికల్లో కూకటి వేళ్ళతో పెకిలించాలని, లేకుంటే రాష్ట్రానికి ప్రమాదకరమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



# సైనికుల త్యాగాలకు స్తూపం.. కాశీనాయన కుంటకు సరికొత్త రూపం

కాశీనాయన కుంట వద్ద సుందరీకరణ పార్కు ఏర్పాటు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రకటన -గాడ్గోర్ డే వేడుకల్లో అమరవీరులకు ఘన నివాళి







**గిద్దలూరు ఎన్ పవర్ అక్టోబర్ 11**

సైనికుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా కాశీనాయన కుంట వద్ద సుందరీకరణ పార్కుతో పాటు సైనిక స్తూపాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రకటించారు. 16వ లైట్ క్యావల్రీ మాజీ సైనికుల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 250వ గాడ్గోర్ డే వేడుకల్లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశ రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎండ, వాన, చలి లెక్కచేయకుండా సైనికులు అహర్నిశలు సేవలందిస్తున్నారని కొనియాడారు. దేశ స్వాతంత్రం, రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలు ఎప్పటికీ మరువలేనివని, వారి త్యాగాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. అటువంటి సైనికుల త్యాగాలకు శాశ్వత గుర్తింపు కల్పించడాన్ని తన బాధ్యతగా భావిస్తూ, పట్టణంలోని కాశీనాయన కుంట పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ది, ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరణ పార్కును అభివృద్ధి చేసి, అలాగే పార్కు మధ్యలో సైనికుల త్యాగాలకు ప్రతీకగా సైనిక స్తూపాన్ని ఏర్పాటు చేసి, వారి సేవలను భావితరాలకు గుర్తుండేలా పరిచయం చేస్తానని వెల్లడించారు. దేశం కోసం సేవలందించిన మాజీ సైనికులను, వారి కుటుంబాలను గౌరవించుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

## టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 11**

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.యర్రగొండపాలెం మండలంలో పల్లె పండుగ 3.0కార్యక్రమంలో భాగంగా 8కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసారు.గురిజేపల్లి గ్రామంలో 3.50 కోట్ల నిధులతో గురుజేపల్లి నుండి అమానిగుడిపాడు గ్రామానికి నిర్మించనున్న నూతన తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా విబిజి రాం నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకుశంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు గారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రహదారులు, ఆరోగ్య సేవలు మరియు పరిపాలన సౌకర్యాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు.అనంతరం పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఎదురు 20లక్షల విబిజిరాం నిధులతో సీసీ రోడ్డు, దిలార్ వీధిలో 20 లక్షలతో డ్రైనేజీ, సైడు కాలువల నిర్మాణానికి, వస్తాదు వీధిలో 20 లక్షల నిధులతో డ్రైనేజీ, కాలువలకు శంకుస్థాపన చేసారు.మిల్లంపల్లి పంచాయతీలోని వేగినాటి కోటయ్య కాలనిలో 20లక్షలతో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, నాయకులు కందుల వెంకటరెడ్డి, వేగినాటి శ్రీనివాస్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, యం సి హెచ్ మంత్రు నాయక్,తోట మహేష్ నాయుడు, జనసేన నాయకులు ఆకుల రమేష్,మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్ వలి, మాజీ ఎంపీటీసీ రఫీ, షేక్ ఇస్మాయిల్, అల్లమాలిక్, పైడి మర్రి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవి శరన్నవరాత్ర మహోత్సవములు



**దొనకొండ అక్టోబర్ 11 పెన్ పవర్**

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో దసరా మహోత్సవంలో భాగంగా ఆనంద ఆశ్రమంలో మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా శ్రీ ఈశ్వరి మహదేవి దర్శనమిచ్చారు ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారికి అష్టోత్తర శతనామావళి సహస్రనామార్చన సామూహిక కుంకుమ పూజ నిర్వహించి పంచభక్ష పరమాణాలు నైవేద్యంగా సమర్పించి మహిళలచే సామూహిక హారతులు ఇచ్చారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంనారు వచ్చిన భక్తులకు ఆశ్రమ అర్చకులు మణి బాబు శర్మ తీర్థ ప్రసాదములు అంద చేశారు ఉభయ దాతలు దొనకొండ వాస్తవ్యులు సముద్రాల ఓబులు రేణుక దంపతులు వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు రెండవ రోజు వేద గాయత్రీ దేవిగా శ్రీ ఈశ్వరీమహాదేవి దర్శనమిస్తుందని శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు.

# ఒంగోలులో పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

## సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 10**



ఒంగోలు నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నా, నియంత్రణకు కీలకమైన ట్రాఫిక్ సిగ్నళ్ల వ్యవస్థ మెరుగుపరిచకపోవడం వాహనదారులకు ఇబ్బందిగా మారిందని, తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు.నగరంలో వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో ప్రధాన కూడళ్లలో రద్దీ పెరుగుతోందని దీనికి తోడు సిగ్నళ్లు పనిచేయకపోవడం, వాహనదారులు ఇష్టానుసారంగా మలుపులు తిరగడం, ఎదురుదిశలో రాకపోకలు సాగించడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. పనిచేయని సిగ్నళ్లను తక్షణమే పునరుద్ధరించాలని, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలని కోరారు.

# గ్రంథాలయంలో చదవటం మాకిష్టం

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 11**

గిద్దలూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన "చదవటం మాకిష్టం" కార్యక్రమంలో భాగంగా బాల బాలికలకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో విజేతలైన బాల బాలికలకు విశ్రాంత ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ మేనేజర్ బొంతల రామ్మోహన్ రావు సహకారంతో సమకూర్చిన బహుమతులను ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజశ్రీ అందజేశారు, అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలకు నోట్‌బుక్, పెన్, పెన్సి ల్తో కూడిన విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజ నాత్మ కతను పెంపొం దించ డానికి చిత్ర లేఖనం వంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని చదువుతో పాటు కళలపై ఆసక్తి పెంచు కోవాలని సూచించారు బాలికల విద్యకు ప్రోత్సాహం అందించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవస రమని ప్రతిబాలిక విద్యా వంతురాలై ఆత్మవి శ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్నకు మారి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సి పాల్ శ్రీనివాసరెడ్డి యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థా పకులు సయ్యద్ ఫరూఖ్ వాసవి జాగృతి మిత్ర మండలి క్లబ్ అధ్యక్షులు వంశీ కృష్ణ ఉపాధ్యాయులు స్వాతి ముసల్ రెడ్డి పాల్గొన్నారు.




# గిద్దలూరు స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధం

## ఆసక్తి ఉన్న అభ్యర్థులు యువత ముందుకు రావాలి..

## పోటీ చేసేవారికి కాంగ్రెస్ పార్టీ తరుపున బీఫామ్‌లు అందిస్తాం:

## మాజీ సైనికుల రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు, గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జి తిరుమల నాయుడు



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 11**

గిద్దలూరు నియోజకవర్గంలో త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తిరుమల నాయుడు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పోటీ చేయదలచిన అభ్యర్థులకు పార్టీ తరఫున అవసరమైన బీఫామ్‌లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో పనిచేయాలని తిరుమల నాయుడు కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి, వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గిద్దలూరు మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారు పార్టీని సంప్రదించాలన్నారు

**కాంగ్రెస్ హయాంలో దేశం అభివృద్ధి పథంలో పయనించింది**

కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని తిరుమల నాయుడు గుర్తుచేశారు. దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీ నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తల ఐకమత్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. యువత, స్థానిక నాయకులు, పార్టీ అభిమానులు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు.

**గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర**

గిద్దలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పాలనలో ఉన్న సమయంలో అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందని తిరుమల నాయుడు గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి పార్టీ చేసిన కృషిని ప్రజలకు వివరించారు. గిద్దలూరు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రాధాన్యత పొందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. స్థానిక సంస్థలు ప్రజలకు నేరుగా సేవలందించే వ్యవస్థలని, వాటి ఎన్నికల్లో ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాయకులు ముందుకు రావడం అవసరమన్నారు.

**మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి**

గిద్దలూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కూడా రానున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమవుతోందని తిరుమల నాయుడు స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆసక్తిగల అభ్యర్థులు ముందుకు వస్తే, పార్టీ తరఫున అవసరమైన బీఫామ్‌లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.రాహుల్ గాంధీ సారథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని తిరుమల నాయుడు తన ప్రకటనలో పేర్కొన్నారు.

# నూతన ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 11**

మార్కాపురం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పంకజ్ కుమార్ మీనాను ఆదివారం ఆయన కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఎస్పీకి శాలువా కప్పి, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నూతన జిల్లా అభివృద్ధిలో పోలీసు శాఖ పాత్రపై చర్చించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు






**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

మార్కాపురం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక నెహ్రూ బజార్ లోని సాయి ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలందరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. అన్ని స్థానిక సంస్థలలో బీజేపీ ప్రాతినిధ్యం పెరిగేలా చూడాలని, అలాగే కూటమి నాయకుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం దేశంలో ప్రతిపక్షాలు ప్రజలను, యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని, ఈ చర్యలను తిప్పికొట్టేందుకు కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి కొక్కెర శ్రీనివాస్, శాసనాల సరోజిని, జే.వీ నారాయణ, ప్రధాన కార్యదర్శులు ఎం. శివప్రసాద్, లక్ష్మణ్ యాదవ్, టీ అశోక్ రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ బీఎల్ఏ-1లు ఆకుల నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, బీ విజయలక్ష్మి, మోర్చాల జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మండల ఇన్చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానం దేశానికి స్ఫూర్తిదాయకం

## సేవా సంకల్ప అభియాన్ తో ప్రజల్లో చైతన్యం -మాదినేని లక్ష్మణ్

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ అంకితభావంతో పనిచేస్తున్నారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాదినేని లక్ష్మణ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితమైన మోదీ ప్రస్థానం దేశాభివృద్ధిలో కీలకమైన మైలురాయిగా నిలుస్తోందన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం, దేశ ప్రధానిగా దేశవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడం, రైతులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, యువతకు అవకాశాలు అందించడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ నిధి, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో కొనసాగుతున్నాయన్నారు. రహదారులు, రైల్వేలు, డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు సేవా సంకల్ప అభియాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి లక్ష్యాలను సాధించగలమని 2047 నాటికి



భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చదిద్దాలనే వికసిత్ భారత్ సంకల్పములో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రగతి ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

# టిడిపి తీర్థం పుచ్చుకున్న పలు కుటుంబాలు

## -ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో చేరికలు






**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 11:**
లింగసముద్రం మండలం రాచెరువు రాజుపాలెం (ఆర్ ఆర్ పాలెం) గ్రామంలో 18 కుటుంబాల వారు వైసిపికి గుడ్ బై చెప్పారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో, కందుకూరులో ఆదివారం తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకున్నారు. వంకదారి పరమేశ్వరరావు, అనమసాని మాచర్ల, చెన్నకృష్ణ, చొప్పర గోవిందు, మధు, శ్రీను, రమణయ్య, కేతినేని నవీన్, కామినేని మాల్యాద్రి, కండే రత్తమ్మ, ఉప్పలపాటి మాల్యాద్రి, నరసింహ, షేక్ జిలాని, మస్తాన్, యడవల్లి హజరత్, యోహోన్, పోతి పోగు రమణయ్య కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరావు వారందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ చంద్ర తిరుపతయ్య, చింతగుంపల వీరభద్రయ్య, మాలకొండయ్య, సుబ్బారావు, చొప్పర తిరుపాలు, రొడ్డా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గడిచిన రెండేళ్లలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని, అన్ని గ్రామాలలో మౌలిక వసతుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని.... పార్టీలో చేరిన వారు తెలిపారు. కూటమి పాలన... జగన్ పాలన కంటే ఎన్నో రెట్లు బాగుందన్నారు. చంద్రబాబు , కూటమి ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో మంచి సానుకూలత ఉందన్నారు.

ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బటన్ నొక్కుడు తప్ప మరొకటి లేదు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నాం. అర్హులందరికీ పథకాలు అందిస్తున్నాం అని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ఇంటింటికి తిరిగి వివరించాలి. మన అభ్యర్థులందరినీ మంచి మెజారిటీతో గెలిపించాలి అని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, క్లస్టర్ ఇంచార్జ్ వంకాయలపాటి మాల్యాద్రి, ఉన్నం వీరాస్వామి, చింతగుంపల మనోహర్, రామకృష్ణ, చంద్ర రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్పీ పంకజ్ కుమార్ మీనాతో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి భేటీ

### నూతన ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు: పెన్ పవర్ అక్టోబర్ 11**
మార్కాపురం జిల్లా నూతన పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) పంకజ్ కుమార్ మీనా,ను గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో నూతన మార్కాపురం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడం వంటి అంశాలపై చర్చించారు. జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగిస్తూ ప్రజలకు భద్రతాభావాన్ని కల్పించడంలో పోలీసు శాఖ కీలక పాత్రపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే శ్రీ కందుల నారాయణ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే శ్రీ ఉగ్ర నరసింహా రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి శ్రీ గూడూరి ఎరిక్సిన్ బాబు పాల్గొన్నారు. ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సాగిన ఈ మర్యాదపూర్వక సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

## నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు



**సి ఎస్ పురం,పెన్ పవర్ అక్టోబర్ 11**
జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం నకు ఆదివారం స్వామివారికి ప్రీతికమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయాలను అనుసరించి శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి స్వామివారి మూలవిరాట్ తో పాటు శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు వివిధ రకాల పూలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు అనంతరం గోశాలలో గోపూజ కార్యక్రమం తదుపరి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించారు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి!

### ఒంగోలు సాగర్ లాడ్జి సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 11**
ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను, ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఒంగోలులోని సాగర్ లాడ్జి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో నిరసన తెలిపిన యువత, విద్యార్థులు, వామపక్ష నాయకులు, ప్రజాప్రతినిధుల అరెస్టులను ఖండించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు నగర సీపీఎం, సీపీఐ కార్యదర్శులు చీకటి శ్రీనివాసరావు, శ్రీరాం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్. వెంకట్రావు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన పౌరుల పేర్లు తొలగిపోయే పరిస్థితులు ఏర్పడకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కుకు భంగం కలగకూడదని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె. మాబు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం స్వతంత్రంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యతను విస్మరించకూడదన్నారు. బీజేపీ--ఆర్ఎస్ఎస్ కూటమి ప్రభుత్వ సంస్థలను ఉపయోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తోందని విమర్శించారు. ఓటు హక్కును కాపాడుకోవడం కోసం యువత, విద్యార్థులు, ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేయడంతోపాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) నాయకులు ఎన్. సాయి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న యువత, విద్యార్థులపై పోలీసుల నిర్బంధ చర్యలు ఆందోళనకరమన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపిన వారిని అరెస్టు చేయడం, మహిళా విద్యార్థినుల పట్ల




దురుసుగా వ్యవహరించడం ప్రజాస్వామ్య నిరసన హక్కును దెబ్బతీస్తుందని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రతి ఒక్కరికీ కల్పించాలని, అక్రమ అరెస్టులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి. మోహన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వ సంస్థలు ప్రజల హక్కులకు రక్షణగా నిలవాలని అన్నారు. ఓటు హక్కు అనేది ప్రజలు పోరాడి సాధించుకున్న రాజ్యాంగ హక్కు అని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసే వరకు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు, యువత, విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన యువత, విద్యార్థులకు వామపక్ష నాయకులు సంఘీభావం తెలియజేయటానికి వెళ్లిన. సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి ఎం.ఏ. బేబీతో పాటు ఇతర నాయకులు, ప్రజాప్రతినిధుల అక్రమ అరెస్టులను ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగించే ఉద్యమాలకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు ఎప్పటికీఇస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

### జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం.



**పెన్ పవర్, కంభం అక్టోబర్ 11**
విశ్వబ్రాహ్మణ సంఘం బలోపేతం చేసేందుకు జిల్లాలోని అన్ని కేంద్రాలలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం మార్కాపురం గడ్డపై విశ్వబ్రాహ్మణుల ఘనకీర్తిని నలుదిశలా చాటుతూ, సంఘ అభ్యున్నతియే ధ్యేయంగా జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా, విజయవంతంగా జరిగింది. కేకే ప్యానెల్ పూర్వ ఆమోదంతో సంపూర్ణ మద్దతుతో ఎన్నికైన అధ్యక్షులు ఆకుమల్ల వెంకటేశ్వరచారి జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం ఆచారి ప్రధాన కార్యదర్శి నల్లగట్ల వీర బ్రహ్మాచారి మరియు ఇతర ముఖ్య కార్యవర్గ సభ్యులు ఈ వేడుకలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. ఈ మహాసభకు మన ముఖ్య అతిథి బ్రహ్మశ్రీ కమ్మరిపల్లి కిరణ్ కుమార్ ఏసిపి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కార్యవర్గం మాట్లాడుతూ తమపై నమ్మకంతో మద్దతు తెలిపిన కేకే ప్యానల్ టీమ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లాలోని విశ్వబ్రాహ్మణుల ఐక్యతకు, సంఘ అభ్యున్నతికి, బంధువుల సంక్షేమానికి నిరంతరం అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి శ్రేయోభిలాషులు విశేష సంఖ్యలో హాజరై సభను దిగ్విజయం చేశారు. విచ్చేసిన ఆత్మబంధువులందరికీ మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ నూతన కార్యవర్గం హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## నేడు ఏల్చూరులో రూ.69 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన



**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 11**
సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో అద్దంకి ప్రధాన రహదారి సమీపంలో 18 ఎకరాల విస్తీర్ణంలో రూ.69 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఉదయం 8:30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఉపకేంద్రం నిర్మాణంతో సుమారు 350 గ్రామాలకు లో వోల్టేజీ సమస్యలు తగ్గి, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమవుతుందని మాజీ సహకార సంఘ అధ్యక్షుడు దుద్దేల చిన్నగాలయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మండలంలోని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, వివిధ స్థాయిల పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుద్దేల చిన్నగాలయ్య విజ్ఞప్తి చేశారు.

## సిమెంట్ రోడ్లకు భూమి పూజ కార్యక్రమాలలో పాల్గొన్న టిడిపి నాయకులు





**సి.ఎస్.పురం,పెన్ పవర్ అక్టోబర్ 11**
మండలంలోని బోయమడుగుల పంచాయితీ పరిధిలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి చిన్న కోటాలపల్లె వరకు మరియు డీజీ పేట నుండి బొంతవారిపల్లి వరకు ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను శనివారం కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు భూమిపూజ చేశారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బోయమడుగుల పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి చిన్న కొటాలపల్లి వరకు వీబీజీ-రామ్ పథకం ద్వారా సిమెంటు రోడ్డుకు రూ.60 లక్షలు మరియు డిజిపేట నుండి బొంతవారిపల్లి వరకు రూ.2 కోట్ల 75 లక్షలను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారులు మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కృషి చేస్తున్నారన్నారు సిమెంటు రోడ్డును మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆయా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యనిర్వహ కార్యదర్శి నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, జిల్లా గొర్రెల పెంపకం సహకార సంఘం సభ్యులు కోసంగి వెంకట కొండయ్య, గోదాసు జయరాములు, పావని తిరుపతయ్య, చీపు శ్రీనివాసులు, రేనాటి వెంకటేశ్వర్లు, వై రమణారెడ్డి, గొర్ల అల్లూరయ్య ఆయా గ్రామస్తులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి శరన్నవరాత్రి ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే రాంబాబుకు ఆహ్వానం



**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 11**
గిద్దలూరు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఘనంగా ఆహ్వానం పలికారు. మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని అన్నా రాంబాబు స్వగృహంలో ఆదివారం గిద్దలూరు ఆర్యవైశ్య యువజన సంఘం కమిటీ సభ్యులు కలిశారు. గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ అన్నా రాంబాబుకు శాలువా కప్పి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలి పోలీసుల ముమ్మర తనిఖీలు

**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 11**
పొదిలి పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఆదివారం నాడు ఒంగోలులో తలపెట్టిన మహా ధర్నాకు అనుమతి లేకపోవడంతో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వేలూరు గ్రామం వద్ద గల చెక్ పోస్ట్ వద్ద ఒంగోలు వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ జరిపారు. పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం రాజేష్ కుమార్, ఎస్ ఐ సూరెడ్డి రాజేష్ ల ఆధ్వర్యంలో వాహనాలను, ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు.



# పొన్నలూరులో కార్డెన్ సెర్చ్





**పొన్నలూరు పెన్ పవర్ అక్టోబర్11**

మండల కేంద్రమైన పొన్నలూరు బీసీ కాలనీలో సీఐ వైవి రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారి నుంచి కాలనీవాసులను బయటకు వెళ్ళనివ్వకుండా పోలీసులు నిగా పెట్టారు. కాలనీ మొత్తం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించిన, మత్తు పదార్థాలు విక్రయించిన పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లో భద్రపరచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో గంజాయి మత్తు పదార్థాల మీద ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తనిఖీల్లో పొన్నలూరు ఎస్సై పి శివ నాగరాజు, మర్రిపూడి ఎస్సై సుదర్శన్, 20 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముత్తుముల ఎల్లారెడ్డికి మహాత్మా గాంధీ జాతీయ శాంతి పురస్కారం



**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 11**

మార్కాపురం పట్టణంలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ప్రెస్ క్లబ్ నందు మహాత్మా గాంధీ జాతీయ శాంతి పురస్కారాల సమావేశం జరిగింది. అనంతరం పెద్దలు పి వి పి అంజనీ కుమారి నారాయణస్వామి, జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణ రెడ్డి సంఘ సేవకులు ,మున్నంగి నాగిరెడ్డి, గొట్టెముక్కల చెన్నకేశవులు చేతులమీదుగా మహాత్మా గాంధీ జాతీయ శాంతి పురస్కారం 2026ను సామాజిక కార్యకర్త టిడిపి యువ నాయకుడు ముత్తుముల ఎల్లారెడ్డి అందుకున్నారు. కొమరోలు మండలంలోసొంత గ్రామం బాదినేనిపల్లిలో ఆధ్యాత్మికంగానూ, సామాజిక కార్యక్రమాలు చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారం అందించిన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొట్టెముక్కల చెన్నకేశవులకు ముత్తుముల ఎల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డ్ అందుకున్న అనంతరం ముత్తుముల ఎల్లారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛందంగా తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు మహాత్మా గాంధీ జాతీయ శాంతి పురస్కారం లభించడం తనకు ఎంతో గర్వకారణంగా ఆనందంగా ఉన్నదని అన్నారు.

# శ్రీ అల్లూరి పోలేరమ్మకు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు

**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

మార్కాపురం పట్టణ శివారులోని శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా వివిధ రకాల పుష్పమాలలు, నిమ్మకాయ దండలతో అమ్మవారి మూలవిరాట్‌కు విశేషంగా అలంకరించారు. వేపాకు తోరణాలు, పూల మాలలతో ఆలయం శోభాయమానంగా దర్శనమిచ్చింది.అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణ జరగగా, పూజా కార్యక్రమాలను సిబ్బంది వెన్నా శ్రీధర్ రెడ్డి పర్యవేక్షించారు.



# భగవద్గీత కంఠస్థ పోటీలో ప్రతిభ చాటిన శ్రీ గిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులు

## – కలశ స్థాపనతో ప్రారంభమైన శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 11**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గో క్షేత్ర భవనంలో శ్రీగిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులకు ఆదివారం భగవద్గీత భక్తి యోగం పై కంఠస్థ పోటీ నిర్వహించారు. విద్యార్థులు పోటీలో ఉత్సాహంతో పాల్గొన్నారు. చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద.. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి పర్యవేక్షించారు.

**శ్రీ గిరి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు కలశ స్థాపన:**

శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి,

**కార్య నిర్వహణ ధర్మకర్త**

సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార ఆత్రేయ, శ్రీ గిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అంద చేశారు.



శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు విశేష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు. 18 వ తేదీ ఆదివారం సాయంత్రం శ్రీవారికి హనుమంత వాహన సేవ.. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు రాయప్రోలు జగదీశ చంద్ర శర్మ చే ఆధ్యాత్మిక ఉపన్యాసం



జరుగుతాయి. 19 వ తేదీ సోమ వారం సాయంత్రం శ్రీవారికి ఊంజల సేవ .. శ్రీ గిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వీవీఎస్ వినోద్ కుమార్ చే భక్తి సంగీత విభావరి జరుగుతాయి. 20వ తేదీ మంగళ వారం సాయంత్రం శ్రీవారికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. శ్రీనివాస మహిళా కోలాటం బృందం చే కోలాట ప్రదర్శన జరుగుతుంది. భక్తులు ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి నిర్వాహకులు కోరారు.

# భైరవకోనలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

## బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన త్రిముఖ దుర్గాదేవి





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలో దసరా పండుగను పురస్కరించుకొని శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజు, కార్యనిర్వహణాధికారి వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించార శరన్నవరాత్రుల తొలిరోజు శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయానికి భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ అర్చక బృందం, వేద పండితులు గణాధిపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భైరవేశ్వరస్వామి, ఇతర స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీదేవి సప్తశతి పారాయణం, రుత్విక్ వరణం, అగ్ని ప్రతిష్ఠ, చండీ హోమం, మహా నివేదన, మంగళహారతి, ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు రుద్ర, దుర్గ, గణపతి హోమాలు ప్రత్యేక వేద పండితులు వేదమంత్రాల నడుమ హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. లోక కళ్యాణం, ప్రజల సుఖసంతోషాలు, సర్వజన శ్రేయస్సు కలగాలని ప్రత్యేక పూజలు చేశారు భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో మీకోసం - జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు

**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 11**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజి ఆర్ఎస్) ను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ వీవవనిశీయిఎ.ఖజా.ఌశీజ.అఅ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల పరిష్కారంపై వారి అభిప్రాయాలను నేరుగా సేకరించి, పరిష్కార నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు,




ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ను ఫిర్యాదుదారులు స్కాన్ చేసి తమ సమస్య పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని తెలిపారు.కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా.. మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణతో పాటు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందడంతో పాటు, సమస్య పరిష్కారమైన అనంతరం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను నమోదు చేసి ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# సి ఎస్ పురంలో ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

మండల కేంద్రమైన సి ఎస్ పురంలోని అతిపురాతన, మహిమాన్వితమైన శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో దసరా పండుగను పురస్కరించుకొని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉభయదాతలు గ్రంధి హేమ సుందరం దంపతులు, దేవస్థాన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని పట్టు వస్త్రాలు, పుష్పమాలలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవస్థానంలో కలశ స్థాపన చేసి గణపతి పూజతో పాటు వివిధ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలు గ్రంధి హేమ సుందరం దంపతులు, దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు హోమాది కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రాల నడుమ నిర్వహించిన హోమాలు ఆలయ ప్రాంగణంలో భక్తిభావాన్ని నింపాయి. అనంతరం పూర్ణాహుతి, స్వామివారికి నైవేద్యం సమర్పించి హారతులు ఇచ్చారు ఈ సందర్భంగా కామాక్షి దేవి భజన మండలి మహిళలు దేవి స్తోత్రం పఠనం చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని



స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమాలలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు

# వైఎస్సార్ సీపీ ఐ డేంటి కార్డుల పంపిణీ

## గిద్దలూరు ఇంచార్జ్ నాగార్జున రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 11**

గిద్దలూరు మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులకు పార్టీ క్యాడర్ కమిటీ లలోని సభ్యుల ఐడి కార్డులను గిద్దలూరు ఇంచార్జ్ కె పి నాగార్జున రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమరంలో పోటీకి ప్రతి ఒకరు సిధంగాఉండాలని కోరారు . బావిష్యత్లో మనం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని నాయకులకు భరోసా నిచ్చారు. నిత్యం ప్రజలతో మమేకం అయి సమస్యలు తెలుసుకొని , పరిస్కారం కు కృషి చేయాలన్నారు.అట్లే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాలకు వివరించాలన్నారు.

# శేషి రెడ్డిని పరామర్శించిన అన్నా రాంబాబు



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 11**

కొనకనమిట్ల మండల వైకాపా నాయకులు కామసాని శేషి రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గం ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు పరామర్శించారు. కొన్ని రోజుల నుండి శేషి రెడ్డి అనారోగ్యానికి గురై, ఒంగోలు పట్టణంలోని సంఘమిత్ర వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం నాడు శేషి రెడ్డిని పరామర్శించారు. అలాగే ఆయన ఆరోగ్యం విషయమై శేషి రెడ్డి సోదరులు కామసాని వెంకటేశ్వర రెడ్డి తదితరులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు.

# నేడు జిల్లా పోలీస్ పిజి ఆర్ఎస్ కార్యక్రమం రద్దు

## జిల్లా ఎస్ పి హర్షవర్ధన్ రాజు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 11**

కొన్ని అనివార్య కారణాల దృష్ట్యా ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరగవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసిన్నట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలతో ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావోద్దని తెలిపారు. జిల్లా ప్రజలు, (ఫిర్యాదుదారులు) ఈ విషయాన్ని గమనించలని తెలిపారు.



# చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా ప్రారంభమైన శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు

## - బాల త్రిపుర సుందరి దేవి ఆకాంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించిన అమ్మవారు

## - బాలికలకు నవ దుర్గ పూజలు నిర్వహించిన శిద్దా లక్ష్మి పద్మావతి







**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 11**

చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఆదివారం నుండి శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. మాజీమంత్రి డా. శిద్దా రాఘవరావు శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు,శిద్దా పాండురంగరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు శ్రీ హరిహర క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు అందుకున్నారు. ఆదివారం ఉదయం శ్రీ వాసవి అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు నిర్వహించి తదుపరి అమ్మవారికి శ్రీ చక్రార్చన సాయంత్రం ఉభయదాతల చే కుంకుమ అర్చన, అర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్ర నామ సోత్రం, ఉభయదాతలచే కుంకుమ పూజ, నైవేద్యం,హారతి, తీర్థప్రసాదాల వినియోగం తొమ్మిది మంది బాలికలకు నవదుర్గ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రెండవ రోజు శ్రీ గాయత్రి దేవి అలంకారం మరియు సామూహిక హరిద్రా అభిషేకంతో భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం కలిగిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. దేవి శరన్నవరాత్రుల పునస్కారించుకొని శ్రీ హరిహర క్షేత్రం విద్యుత్ దీపాలతో అలంకరణతో క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.శిద్దా వెంకటేశ్వర్లు.. వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అల్పాహారం,వాహన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్ దంపతులు, సువర్చల,అరుణ,ఆర్యవైశ్య మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్ధవీడు మండలంలో వైభవంగా దసరా నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం





**అర్ధవీడు పెన్ పవర్ అక్టోబర్ 11**

అర్ధవీడు మండలంలో శ్రీ కోదండ రామస్వామి దేవాలయం, పాపినేనిపల్లి అమ్మవారి శాలనందు, అర్ధవీడు పోలేరమ్మ ఆలయం దగ్గర దసరా నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అర్ధవీడు శ్రీ కోదండ రామస్వామి ఆలయం నందు ధర్మకర్త మోదాల మల్లికార్జునరావు మరియు కుమారుడు సుధాకర్ రావు మొదటి రోజేనా ఆదివారం ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు అర్ధవీడు గ్రామంలో దసరా నవరాత్రుల మహోత్సవం సందర్భంగా గ్రామంలోని పోలేరమ్మ ఆలయం దగ్గర నవరాత్రులలో మొదటి రోజైనా బాలా త్రిపుర సుందరి అవతరణలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇవ్వడం జరిగింది, గ్రామంలోని భక్తులు అమ్మవారికి కుంకుమార్చన వడి బియ్యం కార్యక్రమం, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది . తరువాత అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో భక్తులు విరివిగా పాల్గొన్నారు.

# శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా రెడ్డెమ్మతల్లి



**గుర్రంకొండ, పెన్ పవర్ అక్టోబర్ 11**

అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం ,చెర్లోపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రెడ్డమ్మ దేవత దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా నేడు మొదటి రోజు శ్రీ అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో శ్రీ అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి శ్రీ అమ్మవారికి పంచామృతాభిషేకము చేసి, సామూహిక కుంకుమార్చన నిర్వహించడమైనది. షోడశ విద్యకు అధిష్టాన దేవత అయిన అభయ హస్త ముద్రలో ఉన్న ఈ తల్లిని ఆరాధిస్తే మానసిక బాధలు తొలగి నిత్య సంతోషం కలుగుతుందని అర్చకులు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి యొక్క విశిష్టతను భక్తులకు వివరించారు. పూజలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు , తదుపరి అన్న ప్రసాదం వితరణ చేయడమైనది. కుసుమ కుమారి , రాజా మంజుల రాధాకృష్ణయ్య దంపతులు మదనపల్లి వారు ఈరోజు ఉభయ దారులుగా వ్యవహరించారు. రేపు రెండవ రోజు శ్రీ అమ్మవారు శ్రీ గాయత్రీ దేవిగా దర్శనమిస్తారని ఆలయ చైర్మన్ రాజన్న నాయుడు గారు,ఈవో మంజుల తెలియజేశారు.

# అమ్మవారి శోభయాత్ర ఘనస్వాగతం పలికిన భక్తులు

**ధర్మపురి, పెన్ పవర్ అక్టోబర్ 11**

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మ శోభయాత్ర ఘనంగా కొనసాగింది.అమ్మ రాకతో పండగా వాతావరణం నేల్కొంది.అంబారాన్ని అంటినా సంబరంలో ప్రజలు భక్తులు స్థానికులు ఆటపాటలతో , ఆనందంగా చప్పుడు మ్రోతలతో మారుమోగింది. బంధోబస్త్ గా భద్రంగా అంగరంగా వైభోగంగా ఈ దృశ్యాన్ని చూడడానికి కన్నుల విందుల అనిపించేలా కొనసాగింది. అమ్మ రాకను స్వాగతిస్తూ తదేకంగా చూడసాగారు.



# శరాఫ్ బజార్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభావంగా దసరా బ్రహోత్సవాలు





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 11**

గిద్దలూరు పట్టణంలో ని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయిలో దసరా బ్రహోత్సవాలు ఆదివారం నాడు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి మొదటి రోజు శ్రీ వారు మహావిష్ణువు అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈ ఉత్సవాలు పరాభవ నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమీ మొదలు ఈనెల 20 వరకు నిర్వహించనున్నారు . ఈ సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం ధ్వజారోహణం తో ఘనంగా ప్రారంభమయ్యాయి వేద పండితుల మంత్రోఛ్ఛారణ మధ్య అంగరంగ వైభవంగా దసరా నవరాత్రి దీక్షా పురస్సారం గా బ్రహ్మోస్తవాలు ప్రారంభం అయ్యాయి. ఉదయం గంగోదకం తెచ్చి అర్చనా మూర్తు ల కు పంచామృత అభిషేకం మూల విరాట్ కు వస్త్రాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ అర్చకులు తోటపల్లి చంద్ర శేఖర శాస్రీ ఆధ్వర్యంలో శ్రీ వారి కి అలంకరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాలు పురస్కరించుకుని భక్తులు తండోపతండాలుగా వచ్చి శ్రీ వారిని దర్శించుకుంటున్నారు.భక్తుల కు అన్ని వసతులు కల్పించి తీర్థ ప్రసాదాలు అంద చేస్తున్నారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు గంజి వీరయ్య ఉపాధ్యక్షులురెడ్డి బోయిన పెద్దయ్య ,ప్రధాన కార్యదర్శి కంచర్ల శ్రీనివాసులు పర్యవేక్ష న లో కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

# చలో కలెక్టరేట్ కార్యక్రమానికి అనుమతి లేదు

## - ఒంగోలు డీఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 11**



పునఃపరిశీలన చేయాలని నిర్వాహకులు కోరిన నేపథ్యంలో, పోలీసు శాఖ వారి అభ్యర్థనను పరిశీలించినప్పటికీ, అనుమతికి సంబంధించి విధించిన నిబంధనలు, షరతులను పాటించకపోవడంతో సోమవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి అనుమతి నిరాకరించినట్లు ఒంగోలు డీఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉండటంతో పాటు, ప్రజలకు ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు తలెత్తే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నందున, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే సభలు, సమావేశాలకు అనుమతులు మంజూరు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. 168 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ (144 సెక్షన్)అమల్లో ఉన్నందున నలుగురికి మించి వ్యక్తులు ఒకచోట గుమిగూడరాదని డిఎస్పీ తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, అనుమతి లేని ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనకుండా పోలీసు శాఖకు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# శ్రీ అల్లూరు పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

మార్కాపురం పట్టణంలోని శ్రీ అల్లూరు పోలేరమ్మ అమ్మవారి ఆలయాన్ని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని, జిల్లా ప్రజల సుఖసంతోషాల కోసం మొక్కుకున్నట్లు తెలిసింది.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

## - ఒంగోలు టౌన్ డిఈఈ కేవీ పాండురంగారావు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 11**

కొత్తపట్నం బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్ స్టేషన్ కు 33 కేవి లైన్ లాగుతున్న కారణంగాసోమవారం నాడు కొత్తపట్నం బస్టాండ్ సర్కిల్, తూర్పు క్రిస్టియన్ పాలెం1వ లైన్, 2వ లైన్, బొంత వారి వీధి, మంత్రి శ్రీను వీధి, క్లౌపేట, రైలు పేట తదితర ప్రాంతాలలో ఉదయం 07.00 గం. నుండి మధ్యాహ్నం 02.00 గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ విద్యుత్ డి.ఈ.ఈ కె.వి. పాండురంగా రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పెన్ పవర్ సోమవారం 12 అక్టోబర్ 2026

# అభిషేక్ శర్మ విధ్వంసం.. టీమిండియా భారీ స్కోరు

**వెస్టిండీస్‌తో మూడో టీ20లో భారత్ భారీ స్కోరు**

**20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైన టీమిండియా**

**కేవలం 30 బంతుల్లో 69 పరుగులు చేసిన అభిషేక్ శర్మ**

**మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్, తిలక్ వర్మ**

**విండీస్ బౌలర్లలో ఛేజ్, జోసెఫ్, స్ప్రింగర్‌కు రెండేసి వికెట్లు**



వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్లు దూకుడు ప్రదర్శించారు. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా, నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌట్ అయింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (69; 30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడగా.. ఇషాన్ కిషన్ (37; 18 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో వెస్టిండీస్ ముందు 224 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్, భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆరంభంలోనే సంజూ శాంసన్ (3) వికెట్‌ను కోల్పోయినా, మరో ఓపెనర్ అభిషేక్ శర్మ, వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కేవలం 40 బంతుల్లోనే 108 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 87 పరుగులు చేసింది.

అయితే, భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌కు విండీస్ బౌలర్లు షాకిచ్చారు. ఇషాన్ కిషన్‌ను రోస్టన్ ఛేజ్ ఔట్ చేయగా, అదే ఓవర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఆ కొద్దిసేపటికే, మరింత ప్రమాదకరంగా మారుతున్న అభిషేక్ శర్మ కూడా ఔట్ కావడంతో భారత్ 124 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో తిలక్ వర్మ (28), నితీశ్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టును ఆదుకున్నారు. దాంతో, టీమిండియా స్కోరు 220 పరుగులు దాటింది. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్, షమార్ జోసెఫ్, షమార్ స్ప్రింగర్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, కీమో పాల్, గుడాకేశ్ మోతీకి చెరో వికెట్ దక్కింది. అయితే, విండీస్ బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

# టెస్టుల్లో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ పేసర్

**టెస్ట్ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించిన బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్**

**ఈ ఘనత సాధించిన తొలి బంగ్లా ఫాస్ట్ బౌలర్‌గా రికార్డు**

**అబుదాబిలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న టెస్టులో ఈ అరుదైన ఫీట్**

**మొత్తం 5 వికెట్లు పడగొట్టి.. అత్యంత వేగంగా 50 వికెట్లు పూర్తి**



బంగ్లాదేశ్ యువ ఫాస్ట్ బౌలర్ హసన్ మహమూద్ టెస్ట్ క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించాడు. ఈ ఘనత సాధించిన తొలి బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్‌గా, దేశం తరఫున మూడో బౌలర్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. బంగ్లా జట్టు తరఫున టెస్టుల్లో ఇప్పటివరకు ఇద్దరు స్పిన్నర్లు మాత్రమే హ్యాట్రిక్ సాధించగా, ఓ పేసర్ ఈ ఫీట్ అందుకోవడం ఇదే తొలిసారి.అబుదాబిలోని షేక్ జాయెద్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజైన ఆదివారం ఈ అద్భుతం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌట్ కాగా, బదులుగా బ్యాటింగ్ చేస్తున్న ఆఫ్ఘనిస్థాన్ 220/5 స్కోరుతో నిలిచిన దశలో 26 ఏళ్ల హసన్ మహమూద్ విజృంభించాడు. ఇన్నింగ్స్ 83వ ఓవర్‌లో వరుస బంతుల్లో ముగ్గురు బ్యాటర్లను పెవిలియన్‌కు పంపాడు. తొలుత ఇస్మత్ ఆలమ్‌ను (1) క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే ఖైస్ అహ్మద్‌ను వికెట్ కీపర్ లిట్టన్ దాస్ అద్భుతమైన క్యాచ్ ద్వారా ఔట్ చేశాడు. ఇక మూడో బంతికి జియా-ఉర్-రెహ్మాన్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. హసన్ మహమూద్ కంటే ముందు బంగ్లాదేశ్ తరఫున లెగ్ స్పిన్నర్ అలోక్ కపాలి (2003లో పాకిస్థాన్‌పై), ఆఫ్ స్పిన్నర్ సోహగ్ గాజీ (2013లో న్యూజిలాండ్‌పై) మాత్రమే టెస్టుల్లో హ్యాట్రిక్ సాధించారు. ఈ మ్యాచ్‌లో హసన్ మరో ఘనత కూడా అందుకున్నాడు. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి వికెట్‌ను పడగొట్టి ఐదు వికెట్ల హాల్‌ను పూర్తి చేశాడు.

దీంతో టెస్టుల్లో 50 వికెట్ల మైలురాయిని కూడా చేరుకున్నాడు. బంగ్లాదేశ్ తరఫున అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన పేసర్‌గా నిలిచాడు. హసన్ మహమూద్ దెబ్బకు ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 240 పరుగులకే కుప్పకూలింది. దీంతో బంగ్లాదేశ్‌కు 106 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

# అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేళ.. స్మృతి మంధానకు ప్రత్యేక గౌరవం



భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఇండియా ఆమెను తమ 'సెలబ్రిటీ అడ్వకేట్'గా నియమించింది. ఈ కొత్త బాధ్యతలో భాగంగా బాలికల హక్కులు, భద్రత, వారి సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు క్రీడల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు స్మృతి కృషి చేస్తుంది. బాలికల ఆరోగ్యం, శ్రేయస్సు, సాధికారత కోసం యునిసెఫ్ ఇండియా చేపట్టే కార్యక్రమాలకు మంధాన మద్దతుగా నిలవనుంది. ఈ నియామకంపై స్మృతి మంధాన హర్షం వ్యక్తం చేసింది. "యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. క్రికెట్ ఆడుతూ పెరిగిన నాకు, ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని తెలిసింది. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహం ఉంటే ఆ అవకాశాన్ని అద్భుతంగా మార్చుకోవచ్చు. ప్రతి చిన్నారి, యువత పెద్ద కలలు కని, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం పొందాలి" అని ఆమె పేర్కొంది. గతంలో కూడా స్మృతి లింగ సమానత్వంపై యునిసెఫ్-ఐసీసీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది. యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే మాట్లాడుతూ.. స్మృతి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక యువ అథ్లెట్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ప్రపంచ స్థాయి క్రికెట్ ఐకాన్‌గా ఎదిగిన స్మృతి ప్రస్థానం.. ప్రతిభకు అవకాశం తోడైతే ఏం సాధించవచ్చో బాలికలకు నిరూపిస్తుంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో, బాలికల హక్కులు, నాయకత్వం, శ్రేయస్సుపై పెట్టుబడి పెట్టడమే దేశానికి అత్యంత తెలివైన పెట్టుబడి. ప్రతి బాలిక నేర్చుకోవడానికి, ఆడటానికి, నాయకత్వం వహించడానికి, తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి స్మృతితో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాం" అని వివరించారు. ఇటీవలే హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో స్మృతి మంధాన జట్టు పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2025లో తొలిసారిగా ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో ఆమె కీలక సభ్యురాలు. అదే ఏడాది, ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1,000 వన్డే పరుగులు చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది.

2026 నాటికి మహిళల అంతర్జాతీయ క్రికెట్, టీ20 ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. ప్రస్తుతం మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న స్మృతి, అర్జున అవార్డు గ్రహీత, అలాగే రెండుసార్లు 'ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా గెలుచుకుంది.

# మమితా బైజు టాలీవుడ్ లో మరో ఛాన్స్!




-ప్రేములు-తో యువత హృదయాలను కొల్లగొట్టిన అందాల భామ మమితా బైజు సౌత్ ఇండియన్ చిత్రసీమలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోతుంది. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో, సహజమైన నటనతో అభిమానులను సంపాదిం చుకున్న యంగ్ సెన్సేషన్ టాలీవుడ్‌లో దూకుడు పెంచారు. ఇప్పటికే టాలీవుడ్‌లో విశ్వనాథ్ అండ్ సన్స్ లో నటించిన అమ్మడు తాజాగా మరో భారీ అవకాశం అందుకుందని ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది.ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (గాఎజఖ) నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం -జై హనుమాన్- లో మమితా బైజు కీలక పాత్రలో ఎంపికైందనే వార్తలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొని ఉండగా ఇందులో రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో మమిత భాగమైతే.. అమ్మడి కెరీర్‌కు ఇది బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ కావడం ఖాయం.



**అయితే టాలీవుడ్‌లో మమితా బైజు హడావుడి ఇక్కడితో ఆగిపోలేదు.**

తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ య్యేందుకు సొగసరి వరుసగా పెద్ద ప్రాజెక్టలను లైన్‌లో పెడుతున్నారు. కొత్త ప్రాజెక్ట్ లకు సంబంధించి జోరుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. తన పీఆర్ టీమ్ ఇక్కడా చురుకుగా పని చేస్తుందని తెలిసింది. మరోవైపు మేనేజర్లు నిర్విరామంగా కొత్త అవకాశాల వేటలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.ఒకవైపు మలయాళ చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు టాలీవుడ్‌లోనూ టాప్ మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది మమిత. -ప్రేములు- సక్సెస్ ఇచ్చిన జోరును కంటిన్యూ చేస్తూ తెలుగులోనూ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ఆఫర్లను సొంతం చేసుకుంటోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సౌత్ ఇండస్ట్రీలో ప్రత్యేకమైన మార్కెట్‌ను క్రియేట్ చేసుకుంటోంది.మమితా బైజు కమిట్ అవుతోన్న చిత్రాల ప్రచార సరళిని చూస్తే? రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో మలయాళ భామ హవా మరింత జోరుగా సాగడం ఖాయమనిపిస్తోంది. కంటెంట్ ఓరియెంటెడ్ పాత్రలతో పాటు, స్టార్ హీరోల సరసన పాన్-ఇండియా స్థాయి ప్రాజెక్టలను దక్కించుకుంటూ దూసుకెళ్తున్న తీరు యువ నటీమణులకు స్ఫూర్తిగా నిలుస్తుంది.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com